క్లుప్తంగా

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందజేసిన ఎస్‌బీఐ ఉద్యోగులు

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో నడవలేని రోగులకు ఉపయోగపడే విధంగా ఎస్‌బీఐ సిబ్బంది వీల్‌చైర్ గురువారం వితరణగా అందజేశారు. సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యుడు కాశీవిశ్వనాథానికి బొబ్బిలికి చెందిన రీజనల్ మేనేజర్ ఏఏ.హాశీబ్, హెచ్‌ఆర్.శ్రీకాంత్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ పి.కిశోర్ కలిసి వీల్‌చైర్ అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది ఎస్‌బీఐ ఉద్యోగులను అభినందించారు.

పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యం

బాడంగి: మండలంలోని 18 ఆర్బీకేల ద్వారా ఇంతవరకు 6,100 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, ఈ ఏడాది మొత్తం పది టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. గతేడాది 9,862 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. గత నెల 23 వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి బిల్లులు రైతుల ఖాతాలకు జమయ్యాయని చెప్పారు. మండలంలో రబీ పంటల సాగు సుమారు 1200 ఎకరాల వరకు ఉందన్నారు. మినప, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, రాగి పంటలు సాగవుతున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



సిబ్బందితో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జ్ మురళి

బాడంగి: మండల హౌసింగ్ శాఖ కార్యాలయ మండల ఇన్‌చార్జ్‌గా భవిరెడ్డి మురళి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మెరకముడిదాం మండలంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన నడిమింటి సత్యం డిసెంబర్ 31న పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో మురళి మండల ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.

పిరిడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



పిరిడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మీ వేణుగోపాలనాయుడు, తదితరులు

బొబ్బిలి: మండలంలోని పిరిడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



బాడంగి: బ్రెయిలీ చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

బాడంగి: అంధులు చదువుకోవడానికి బ్రెయిలీ లిపి రూపొందించిన లూయిస్ బ్రెయిలీ కారణజన్ముడని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. సత్యనారాయణ అన్నారు. బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, అంధులకు గుర్తింపు తీసుకువచ్చిన ఘనత బ్రెయిలీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు రమేష్, రామరావు, సత్యనారాయణ, నారమ్మ, కల్యాణి, సంధ్యారాణి, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక భవిత సెంటర్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు తొలుత బ్రెయిలీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అంధుల కోసం ప్రత్యేకంగా ఓ లిపిని కనుగొన్న ఆయన అంధుల పాలిట దేవుడయ్యారని కొనియాడారు. దివ్యాంగులంతా బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ విద్యార్థులకు నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆడీ ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



వంగర: నియోజకవర్గ ప్రజలకు తలే రాజేష్‌ను పరిచయం చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వంగర: పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ అధ్యక్షతన కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీకి హాజరైన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.3 వేలకు పెంచడం జరిగిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల్లోని ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ప్రకటించిన హామీల్లో 99.5 శాతం హామీలు నెరవేర్చామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు మళ్లీ గ్రామాలకు వచ్చి, అబద్ధపు హామీలు ఇస్తారని, వాటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పింఛన్ల కోసం గతంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు ఎన్నో ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్ అందుతోందన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిగిన ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తలే రాజేష్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించడం జరిగిందని, ఎమ్మెల్యే కంబాల జోగులుకు సహకరించిన విధంగానే రాజేష్‌కు కూడా సహకరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్ కలిసి ప్రజలను కోరారు. అంతకుముందు మహిళా శక్తి పథకం పేరిట మంజూరైన ఆటోను సదరు నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మరిచర్ల విజయలక్ష్మి గంగారావు తదితరులు పాల్గొన్నారు.



వంగర: కార్యక్రమానికి హాజరైన పింఛన్ లబ్ధిదారులు



బొబ్బిలి: 29వ వార్డులో జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి విస్సు

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ గురువారం జరిగింది. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ గురాల జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు.

కవిరాయునివలసలో..

తెర్లాం:మండలంలోని కవిరాయునివలసలో గురువారం పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్, మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు

బొబ్బిలి: ఇచ్చిన మాట ప్రకారం పట్టణం పింఛన్ మొత్తాన్ని మూడు వేల రూపాయలకు పెంచడంతో వాడవాడలా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విసు), తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పలుచోట్ల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో లబ్ధిదారులు జగనన్న చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.

పెన్షనర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్...



తెర్లాం: నందబలగలో వృద్ధురాలికి పెన్షన్ పంపిణీ చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: పెన్షన్‌ను దశల వారీగా మూడు వేల రూపాయలకు పెంచుతామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందబలగలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల హామీలను వందశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడేనన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను నాలుగున్నరేళ్లలో అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నారని కొనియాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, మాజీ ఎంపీపీ యర్రా రామినాయుడు, సర్పంచ్, నాయకులు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థను నాశనం చేసింది చంద్రబాబే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పక్కన ఎంపీపీ లక్ష్మణరావు

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ధ్వజం

రామభద్రపురం: రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేసింది టీడీపీ అధినేత చంద్రబాబేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు పెత్తనం అప్పగించడంతో లోకల్ బాడీ పూర్తిగా నీరుగారిపోయిందన్నారు. ఆ విషయం మరిచిపోయిన చంద్రబాబు తాజాగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. అప్పట్లో జన్మభూమి కమిటీ సభ్యులు చెబితేనే పింఛన్లు మంజూరు చేసేవారని..అది కూడా ఆ గ్రామంలో ఎవరో చనిపోతే ఆ స్థానంలో మరొకరికి పింఛను మంజూరు చేసేవారన్నారు. అలాగే రేషన్ కార్డు మంజూరుకు సంవత్సరాల తరబడి తిప్పేవారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వల్ల సర్పంచ్‌లకు గౌరవం పెరిగిందన్నారు. అర్హత ఉండే చాలు సర్పంచ్ సమక్షంలోనే పింఛన్లు, కార్డులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. పేద ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రీ ప్రవేశపెట్టని విధంగా పథకాలు ప్రవేశపెట్టి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, సీనియర్ నాయుకుడు లెంక శ్రీనివాసరావు, పతివాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్తగా 73 మందికి పింఛన్లు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని 73 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఈ నెల 8వ తేదీన కొత్త పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో 35 వృద్ధాప్య, 38 వితంతు, 11 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ..

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ సచివాలయం వద్ద కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ హాజరవుతున్నారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

నూతన పింఛన్ల పంపిణీ నేడు

బాడంగి: వైఎస్సార్ పింఛన్‌కానుక పథకం ద్వారా కొత్తగా మంజూరైన ఫించన్లను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు మండల పరిషత్ పరిపాలనాధికారి రామలింగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 88 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కాగా.. ఈ నెల నుంచే 3 వేల రూపాయలకు పెంచినట్లు పేర్కొన్నారు.

ముగడలోఆరోగ్య సురక్ష శిబిరం నేడు

బాడంగి: మండలంలోని ముగడ విలేజ్ క్లినిక్ వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు వాడాడా పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా



తాగునీటి పంపింగ్ హౌస్ సందర్శనలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. రేగిడి మండలంలోని సంకిలి నాగావళి నది వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన పైప్‌లైన్ వద్ద నీటి పంపింగ్ విధానాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ సమ్మె చేస్తున్న కారణంగా పట్టణంలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రాంతాల వారీగా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయనున్నామన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఈ వెంకట్, ఆర్ఐ చక్రవర్తి ఉన్నారు.

విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

• డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

రామభద్రపురం: విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం ఉన్నత పాఠశాలల్లో గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమల ప్రసాద్, పెంటయ్య, హెచ్‌ఎంలు కామేశ్వరరావు, ప్రసాదరావు, ఉపాధ్యాయులు నాగభూషణరావు, మురళీకృష్ణ, దాలినాయుడు, శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసచివాలయం ప్రారంభం



హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు చేసి, సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గోవిందరావు దంపతులు

రేగిడి: మండలంలోని చాటాయివలసలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, లక్ష్మి దంపతులు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు గోవిందరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వంగర: మండలంలోని మగ్గూరులో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానార్చకులు తిరుచూరు శేషుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


11,410 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న ఏవో రేణుకాసాయి

రాజాం: మండలంలోని రైతుల ద్వారా ఇప్పటివరకు 11,410 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఏవో ఎ.రేణుకాసాయి తెలిపారు. మండలంలోని కొత్తవలస, మారేడుబాక, నందబలగ, లక్ష్మీపురం, ముద్దాడజోగివలస గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆమె ధాన్యం కొనుగోలును పరిశీలించారు. రైతులంతా ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని, దళారులను ఆశ్రయించి, మోసపోవద్దన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయ ఆవరణలో వెలిగించిన దీపాలు

బొబ్బిలి: ధనుర్మాసం సందర్భంగా గురువారం స్థానిక కంచరవీధిలోని కల్యాణ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పాశురాల పూజలు చేశారు. కుత్తు విళక్కెరియ పేరిట దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంతర పంటగా నవధాన్యాల సాగు

రేగిడి: రానున్న రబీ సీజన్‌లో అపరాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారని, దీనిలో నవధాన్యాలను అంతర పంటగా వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం ఎమ్‌టీ శారద తెలిపారు. గురువారం మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటకూర, గోంగూర, చిక్కుడు, జొన్న, సజ్జ, రాగి తదితర విత్తనాలను పంటల్లో వేయాలని తద్వారా ఒకేసారి రెండు నుంచి మూడు రకాల పంటలు దిగుబడిగా వస్తాయన్నారు. ఈ విధానం ద్వారా సూక్ష్మజీవుల వృద్ధి జరిగి, భూములు గుల్లబారి సారవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం సిటీ: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని బొద్దాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువువలస గ్రామంలో అయోధ్య రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి తెచ్చిన అక్షితలను పంపిణీ చేశారు. జై శ్రీరామ్ నినాదాలతో పరమ పవిత్రంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు ధూపం వాసు, స్థానిక అర్చకుడు ఎం. వెంకటరమణ, బాల వికాసం కేంద్రం ఆచార్యులు రాయల పాపారావు, భజన ప్రముఖ్ హనుమంతు కన్నయ్య, భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్, తదితరులు

మెంటాడ: మండలంలోని గుర్ల సచివాలయం పరిధి కారుమామిడివలస ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ త్రివిక్రమ్ గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏపీఎం రమణ, తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్తంగా...

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

చోడిసాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని పారంపేట రైతు భరోసా కేంద్రంలో చోడిసాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మార్కెట్‌లో చోడిపంటకు మంచి డిమాండ్ ఉందని, ఈ పంటను సాగు చేసుకోవడం ద్వారా మంచి లాభాలు వస్తాయన్నారు. పంట మార్పిడి ద్వారా నేల కూడా సారవంతమవుతుందన్నారు.

మెనూ తప్పనిసరి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో మెనూ తప్పనసరిగా పాటించాలని ఎంఈవో-2 బి.ఎరకయ్య సూచించారు. గురువారం మండలంలోని ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల మానసిక సామర్థ్యాలపై ఆరాతీశారు. అనంతరం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు సూచించారు.

మద్యం విక్రయిస్తే చర్యలు..

వంగర: అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీధర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని అరసాడకు చెందిన ఓ మహిళ వద్ద విక్రయిస్తున్న సారాను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.